క్లుప్తంగా

భూసార పరీక్షలు నిర్వహించాలి

మరికల్: వానాకాలంలో పంటలు సాగు చేసే ముందు వ్యవసాయశాఖ అధికారులు భూసార పరీక్షలు నిర్వహించాలని రైతు సంఘం నాయకులు దండు శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, పద్మనాభం, రాములు కోరారు. మంగళవారం వారు మాట్లాడుతూ భూ పరీక్షలు నిర్వహిస్తేనే భూమిలో ఏ పంట సాగు చేయాలనే విషయం తెలుస్తుందన్నారు. ప్రతి రైతుకు చెందిన భూములను అధికారులు పరీక్షలు చేసి ఏ పంటలు సాగు చేయాల్లో రైతులకు సూచించాలన్నారు. లేకుంటే వేసిన పంటలు దిగుబడి రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

మరికల్: మండలంలోని పస్పుల గ్రామానికి చెందిన నారాయణగౌడ్‌కు చెందిన ఆవు మంగళవారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. పస్పుల స్టేజీ సమీపంలో ఉన్న ఓ రైస్‌మిల్లు వద్ద విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన బల్బు తీగలు తెగిపడడటంతో మేత కోసం వెళ్లిన ఆవుకు తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందిందని అక్కడ ఉన్న వరిధాన్యం తీసుకొచ్చిన రైతులు తెలిపారు. దీంతో రూ.60 వేల నష్టం పోయినట్లు బాధిత రైతు వాపోయారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరుతున్నాడు.

రక్తదాన శిబిరాలు నిర్వహించాలి

నర్వ: మండలంలోని ప్రజాప్రతినిధులు, యువత నాయకులు రక్తదాన శిబిరాలు నిర్వహించాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ మేనేజర్, విశ్రాంత తహసీల్దార్ చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రక్త నిల్వల కొరత అధికంగా ఉందని రక్తదానం చేసేందుకు యువకులు ముందుకు రావాలని పేర్కొన్నారు.

తాగునీటి ట్యాంకు కూల్చివేత



ఊట్కూర్: మండలంలోని గాంధీనగర్‌లో శిథిలావస్థకు చేరిన తాగునీటి ట్యాంకును మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కూల్చివేశారు. ఒక లక్ష లీటర్ల సామర్థ్యం గల తాగునీటి ట్యాంకును 1999లో నిర్మించారు. ట్యాంకు శిథిలావస్థకు చేరడంతో కూల్చివేసినట్లు సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి తెలిపారు. కార్యదర్శి సుమలత, పోలప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం

నారాయణపేట రూరల్: పట్టణంలోని మెట్రో ఫంక్షన్‌హాల్‌లో బుధవారం ఉదయం 10గంటలకు బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి ప్రభాకరవర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నాయకులు హాజరై దిశానిర్దేశం చేస్తారని, జిల్లా పదాధికారులు, మండల బాధ్యులు, మోర్చాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని కోరారు.

పుస్తకం ఆవిష్కరణ



నారాయణపేట: తెలంగాణ సామాజిక, ఆర్థిక ముఖ చిత్రం-2023 పుస్తకాన్ని జిల్లా ముఖ్య ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆవిష్కరించారు. గ్రూప్స్ 1, 2, 3, 4 పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ యువతకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ పుస్తకంలో తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలు తదితర పూర్తి సమాచారం ఉందన్నారు. కలెక్టర్‌తో పాటు సీపీఓ గోవిందరాజన్, అధికారి శ్రీదేవి ఉన్నారు.

ఘనంగా పోలమ్మ దేవత ఉత్సవాలు



మాగనూర్: మండలంలోని కొత్తపల్లి పోలమ్మ దేవత ఉత్సవాలు మంగళవారం నేత్రపర్వంగా సాగింది. ఉదయం నుంచి గ్రామంలో పండుగ వాతావరణం కనిపించింది. ఈ సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేశారు. అమ్మవారిని పూలతో అలంకరించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పాడిపంటలు బాగా పండాలని, గ్రామ ప్రజలు సంతోషంగా ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తిమ్మప్ప, ఎంపీటీసీ బంగి లక్ష్మి, ఉప సర్పంచ్ అంజమ్మ, సింగిల్ విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- జెడ్పీ వైస్ చైర్మన్ గౌని సురేఖరెడ్డి
- ముగిసిన జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలు



బహుమతులు అందిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ గౌని సురేఖరెడ్డి

నారాయణపేట రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో చక్కగా రాణించి ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని జెడ్పీ వైస్ చైర్మన్ గౌని సురేఖరెడ్డి అన్నారు. స్థానిక మినీ స్టేడియం గ్రౌండ్‌లో జరుగుతున్న సీఎం కప్ జిల్లా స్థాయి పోటీల ముగింపు సభకు మంగళవారం రాత్రి ఆమె హాజరై బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు ఆటలపై మక్కువ పెంచాలని, చదువుతో పాటు క్రీడల్లో రాణించే విధంగా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. ఆటలు ఆడటం వల్ల శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఎన్నో రకాల అనారోగ్య సమస్యల నుంచి విముక్తి పొందడానికి ఆస్కారం ఉంటుందని తెలిపారు. ప్రతి పాఠశాలలో ఆటలకు ఒక పీరియడ్ ఏర్పాటు చేశామని, దానికి అనుగుణంగా పీఈటీల నియామకం జరిగిందన్నారు.

ప్రత్యేక నిధులు కేటాయింపు..

క్రీడా సామగ్రి కొనుగోలుకు ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించిందని తెలిపారు. వేసవిలో ప్రత్యేకంగా సమ్మర్ క్యాంపులను ఏర్పాటు చేసి క్రీడలు ఆడిస్తున్నారని చెప్పారు. చక్కటి ప్రతిభ కల్గిన క్రీడాకారులను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ వేదికల్లో రాణించే విధంగా తీర్చిదిద్దుతామని, ప్రతి ఒక్కరిలో దాగి ఉన్న కళను వెలికి తీయాలని సూచించారు. క్రీడా కోటా కింద సైతం ప్రభుత్వ ఉద్యోగాలను సంపాదించుకోవచ్చని సూచించారు. గ్రామీణ విద్యార్థుల ప్రోత్సాహానికి సీఎం కప్ పోటీలను నిర్వహిస్తున్నామని, జిల్లా స్థాయిలో చక్కటి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్, మార్కెట్ చైర్‌పర్సన్లు గందె అనసూయ, జ్యోతి, డీవైఎస్‌ఓ కృష్ణమాచారి, పీఈటీలు గోపాలం, రమణ, సాయినాథ్, పారిజాత, రాధిక, పరంజ్యోతి, రూప, రాజేశ్వరి, వెంకటప్ప, రాజశేఖర్ పాల్గొన్నారు.

సబ్బండవర్గాల అభ్యున్నతే ధ్యేయం



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: సబ్బండ వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో తహసీల్దార్ కార్యాలయంలో 70 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఆయన చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఆడబిడ్డ పెళ్లిళ్లకు తల్లిదండ్రులు ఇబ్బందులు పడుద్దని ఉద్దేశ్యంతో కల్యాణలక్ష్మి పథకానికి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతుందన్నారు. బంగారు తెలంగాణే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వనజ, తహసీల్దార్ తిరుపతయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు శంషోద్దీన్, కౌన్సిలర్లు చీరాల సత్యనారాయణ, ఎండీ సలాం, నేతాజీరెడ్డి, శివారెడ్డి, ఈశ్వర్ పాల్గొన్నారు.

మాగనూర్: కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదలకు వరంగా మారాయని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో కల్యాణ లక్ష్మి ద్వారా మంజూరైన 25 చెక్కులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీపీ శ్యామలమ్మ, వైస్ ఎంపీపీ తిప్పయ్య, ఎంపీటీసీ ఎల్లారెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ అమీర్, ఆర్‌ఐ శ్రీశైలం, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు రాజు, నర్సిములు, అశోక్‌గౌడ్, నాయకులు నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

25న ప్రజావాణి

నర్వ: ఈ నెల 24న మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని అనివార్య కారణంగా వాయిదా వేసి 25న గురువారం నిర్వహిస్తున్నట్లు మండల అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు తమ విజ్ఞాపణలు, భూసమస్యలు, ధరణి సమస్యల పరిష్కారానికి వినతులు అందించాలని పేర్కొన్నారు. ప్రజావాణికి కలెక్టర్ కోయ శ్రీహర్ష హాజరవుతారని వివరించారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, జేపీఎస్‌లు

కోస్గి: పంచాయతీ కార్యదర్శులను రెగ్యూలరైజ్ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడంపై మంగళవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సీఎం కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జేపీఎస్‌లకు అండగా ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మధుకర్ రావు, జెడ్పీటీసీ ప్రకాష్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, నాయకులు మ్యాకల రాజేష్, గందె ఓంప్రకాష్, వెంకట్‌నర్సిములు, వేణుగోపాల్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

హిందువులు సంఘటితం కావాలి



మాట్లాడుతున్న పీఠాధిపతి చెన్న సిద్ధరామయ్య పండితారాధ్య

మక్తల్: హిందువులు సంఘటితం కావాలని శ్రీశైల పీఠాధిపతి జగద్గురు చెన్న సిద్ధరామయ్య పండితారాధ్య అన్నారు. నాలుగు రోజులుగా పట్టణంలో మల్లికార్జున స్వామి ఆలయంలో కొనసాగుతున్న జ్యోతిర్లింగాల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు దైవ స్వరూపులన్నారు. ప్రతిరోజు కన్నవారికి పాద నమస్కారం చేయాలని కోరారు. తల్లిదండ్రుల సేవ ఎంతో పుణ్యదాయకమన్నారు. అంతకు ముందు జ్యోతిర్లింగాలకు స్వామీజీ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, పీఠాధిపతులు సిద్ధలింగేశ్వర మహాస్వామి, గురుశివచార్య మహస్వామి, శంభు సోమనాథ శివచార్య మహాస్వామిజీ, శంభులింగమహ, కోటేశ్వర వివాచార్యులు మహాస్వామిజీ, బీజేపీ నాయకుడు కొండయ్య, జలందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు రాజుల ఆశిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అఖిల రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

నారాయణపేట రూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగానే డ్రైవింగ్ చేయాలని ఎస్‌ఐ చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని వివిధ చౌరస్తాల్లో ఏఎస్‌ఐ, కానిస్టేబుళ్లతో కలిసి మంగళవారం డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనం నడపరాదని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా నేరమని, అందుకు జైలుశిక్ష, జరిమానా ఉంటుందని హెచ్చరించారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కోయిలకొండకు చెందిన తుఫాన్ డ్రైవర్ మద్యం సేవించినట్లు గుర్తించి ఆయన వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. బుధవారం కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.

బాలకేంద్రం చిన్నారులకు ప్యాడ్లు వితరణ



విద్యార్థులకు ప్యాడ్లు అందిస్తున్న డాక్టర్ సచిన్

నారాయణపేట రూరల్: బాలకేంద్రంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరానికి హాజరవుతున్న 90మంది చిన్నారులకు మంగళవారం డాక్టర్ సచిన్ మంగళ్గి ఆధ్వర్యంలో ఉచితంగా ప్యాడ్లను అందించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడుతున్న సమయంలో ఎంతో మంది తల్లులు తమ పిల్లలకు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను నేర్పించాలనుకోవడం అభినందనీయమని కొనియాడారు. చదువుతో పాటు కళల్లో ప్రావీణ్యం పొందడం ఎంతో ముఖ్యమైందన్నారు. తబల, గాత్రం, నృత్యం, చిత్రలేఖనం తదితర అంశాలపై శిక్షణకు రావాలని సూచించారు. అదేవిధంగా బీద విద్యార్థులకు చక్కటి కళలు నేర్పిస్తున్న బాలకేంద్రం అభివృద్ధికి రూ.10వేలను డాక్టర్ కార్తీక్ గందె అందించారు. కార్యక్రమంలో డాక్టర్ స్వప్న, సిబ్బంది సంగ నర్సింహులు, వసంత్, జ్ఞానామృత, శంకర్ పాల్గొన్నారు.

సందడి లేని క్రీడాప్రాంగణాలు

- వసతులు లేక నిరుపయోగం
- ఊర్లకు దూరంగా ఏర్పాటు
- ఖాళీ స్థలాల్లో వేసవి ఆటలు



ఎలిగండ్లకు రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న క్రీడా ప్రాంగణం

మరికల్: వేసవి సెలవులు రావడంతో చిన్నారులు ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ ఆటల్లో మునిగి తేలుతున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన పల్లె, పట్టణ క్రీడాప్రాంగణాల్లోని మైదానాలు మాత్రం బోసి పోయాయి. సౌకర్యాలు లేక, గ్రామాలకు దూరంగా ఉండటం ఇతర కారణాలతో ఉపయోగించుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు, చిన్నారులు ఇళ్ల మధ్యన, పొలం గట్లపై ఆటలు ఆడుతూ కనిపిస్తున్నారు. గ్రామాల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని 2022 మే 18న సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. గ్రామానికి ఒకటి చొప్పున, పురపాలికల వార్డులు, డివిజన్‌కు జనాభాను బట్టి ఒకటి లేదా రెండు చొప్పున ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఒక్కో దానికి రూ. 3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వ్యయాన్ని వెచ్చించారు. గతేడాది జూన్ 2వ తేదీన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వీటైనన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చెప్పడంతో జిల్లాలో తొలి విడతలో ప్రతి మండలంలో రెండేసి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. తర్వాత వర్షాకాలంలో పెద్ద వానలకు చాలాచోట్ల వాటి రూపును కోల్పోయాయి. చెరువు శిఖం స్థలంతో పాటు ఇతర లోతట్టు ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయడంతో నీరు చేరి వినియోగించుకోలేని పరిస్థితి తలెత్తింది.

ఇబ్బందులు అనేకం..

చాలాచోట్ల గ్రామానికి దూరంగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. రాళ్ల మధ్యన, గుట్టల చెంతన ఉండటంతో అక్కడికి వెళ్లి ఆటలాడే పరిస్థితి లేదు. కొన్నిచోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు స్థలాన్ని వినియోగిస్తున్నారు. ఎక్కువ ప్రాంగణాల్లో బోర్డులు మాత్రం పెట్టి మిగతా ఆటలకు చెందిన ఉపకరణాల్ని అమర్చకుండా వదిలేశారు. ఎక్కువగా పల్లెల్లో చెరువు శిఖం స్థలాలు, లోతట్టు ప్రాంతాలను అప్పటికప్పుడు మైదానాలుగా మార్చి మమ అనిపించి వసతుల్ని మరిచారు. చదును చేయకుండానే వదిలి పెట్టడంతో మైదానాలు ఎగుడు దిగుడుగానే ఉన్నాయి. ఆటలకు ఉపయోగపడటం లేదు. నిర్వహణ విషయంలో నిధుల ఊసే లేకపోవడంతో స్థానిక ప్రజాప్రతినిధులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. లాంగజంప్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఆడేందుకు ఏర్పాటు చేసిన సామగ్రి చాలాచోట్ల నిరుపయోగంగానే ఉంది. క్రీడా సామగ్రి అందక ఇబ్బంది పెరిగింది. కనీసం వీటి పరిస్థితి ఎలా ఉందనే పర్యవేక్షణ లేదు. ఆయా శాఖల మధ్య సమన్వయం లేక క్రీడాకారులకు శాపంగా మారింది.

> **సౌకర్యాలు కల్పిస్తాం..**
>
> క్రీడా ప్రాంగణాలను ఎక్కడ స్థలం ఇస్తే అక్కడే ఏర్పాటు చేశాం. ప్రధాన మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణాల్లో కనీస సౌకర్యలను కల్పించాం. పల్లె క్రీడా ప్రాంగణాల్లో సౌకర్యాలు కల్పిస్తాం.
>
> – గోపాల్‌నాయక్, డీఆర్‌డీఓ, నారాయణపేట

గొర్రెల పంపిణీకి లబ్ధిదారుల వివరాలు



పశువైద్య అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట: గొర్రెల పంపిణీకి లబ్ధిదారుల వివరాలను ఈ నెలఖరులోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పశువైద్య అధికారులతో గొర్రెల పెంపకం, పాల ఉత్పత్తి తదితర అంశాలపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో మలివిడత గొర్రెల పెంపకం కార్యక్రమంలో భాగంగా అర్హులైన 10,817 మందిలో ఇప్పటి వరకు 5,724 మంది లబ్ధిదారుల వాటా చెల్లించడం జరిగిందన్నారు. ఆయా లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ ఈనెల 31లోగా సంబంధిత ధ్రువపత్రాలను సేకరించి నిర్వహించాలన్నారు. ప్రతి లబ్ధిదారుని బ్యాంక్ ఖాతా కులం, ఆధార్ తదితర పత్రాలను తీసుకోవాలన్నారు. అప్‌లోడ్ చేయడానికి అవసరమైన డాటా ఎంట్రీ ఆపరేటర్‌లను నియమించుకోవాలని సూచించారు. జిల్లాలో పాల ఉత్పత్తి పెంపొందించడానికి రైతులకు అదనపు ఆదాయ మార్గాలను పాడి పరిశ్రమపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 810 లీటర్ల పాల సేకరణ విజయడైరీ సేకరిస్తున్నదన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధి చెందేలా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పశువైద్యశాఖ అధికారి శ్రీనివాసకుమార్, సహాయ సంచాలకులు, వీఏఎస్‌లు పాల్గొన్నారు.

పల్లె దవాఖానాలను త్వరగా పూర్తి చేస్తాం

నారాయణపేట: జిల్లాలో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ ప్రారంభం దృష్ట్యా అన్ని ఏర్పాట్లు చేపడతామని, మొత్తం 38 పల్లె దవాఖానాలు మంజూరు కాగా, ఇప్పటివరకు 14 భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయని, 8 భవనాలు పురోగతిలో ఉన్నాయని కలెక్టర్ కోయ శ్రీహర్ష, వీసీలో మంత్రి హరీశ్‌రావుకు వివరించారు. బుధవారం హైదరాబాద్ నుంచి జిల్లాకు మంజూరైన పల్లె దవాఖానా, సబ్‌సెంటర్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 2,26,751 మందికి కంటి పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా ఇప్పటివరకు 2,15,700 మందికి నిర్వహించామని అన్నారు. జిల్లాకు 39,626 రీడింగ్ గ్లాసులు వచ్చాయని అందులో అవసరమైన 32,608 మందికి అందించామన్నారు. డాక్టర్ ప్రిస్‌క్రిప్షన్ మేరకు 24,812 మందికి కంటి అద్దాలకై ఇండెంట్ పంపగా 19,732 సరఫరా చేసినట్లు తెలిపారు. కలెక్టర్‌తో పాటు ఈవీసీలో డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ రాంమోహన్ రావు, పంచాయితీ రాజ్ ఇంజనీయర్ నరేందర్, ప్రోగ్రాం అధికారి భిక్షపతి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమికి హద్దులు ఏర్పాటు



తిప్రాస్‌పల్లిలో కంచె ఏర్పాటు చేస్తున్న అధికారులు

ఊట్కూర్: మండలంలోని తిప్రాస్‌పల్లి గ్రామ శివారులో మంగళవారం కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ తిరుపతయ్య ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు మధ్య ప్రభుత్వ భూమికి హద్దులు ఏర్పాటు చేశారు. గతంలో తిప్రాస్‌పల్లి గ్రామస్తులకు పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం 1971, 1979, 1985లో విడతల వారీగా సర్వే నెం. 51లో 12-30 ఎకరాలు, సర్వే నెం. 52 లో 12-24 ఎకరాల భూమిని రైతుల దగ్గర కొనుగోలు చేశారు. గ్రామంలో 283 మంది లబ్ధిదారులకు గుర్తించి ఇళ్ల పట్టాలను అందించారు. పక్షం రోజులు కిందట సర్వే చేపట్టగా స.నెం. 52లో 3 ఎకరాల 34 గుంటలు మిగులు భూమి తేలింది. ఈ విషయమై రెవెన్యూ అధికారులు మిగిలిన భూమికి హద్దులు గుర్తించి కంచె ఏర్పాటు చేశారు. ఎవరైన ఆక్రమణకు ప్రయత్నిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. గ్రామంలో ముందస్తుగా సీఐ సీతయ్య, ఎస్‌ఐ రమేశ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాఘవేందర్‌రెడ్డి, సర్వేయర్ ఆంజనేయులు, పర్వతాలు, 50 మంది పోలీసులు పాల్గొన్నారు.

జీఓ 69 అమలుతోనే సాగు, తాగునీరు



మాట్లాడుతున్న కెంచె శ్రీనివాసులు

నారాయణపేట రూరల్: జిల్లా ప్రజలకు తాగు నీరు, రైతులకు సాగునీరు అందించేందుకు జీఓ 69ని అమలు చేయాలని జల సాధన సమితి కన్వీనర్ కెంచె శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద మున్సిపల్ పార్క్ వద్ద జల సాధన సమితి ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాడు ఉమ్మడి రాష్ట్రంలో గవర్నర్ పాలనలో ఇచ్చిన జీఓను టీఆర్‌ఎస్ ప్రభుత్వం తొక్కి పెట్టిందని, పాలమూర్ - రంగారెడ్డి ఎత్తిపోతలను తెరమీదకు తెచ్చి జిల్లా ప్రజలను మోసం చేస్తుందన్నారు. మిగులు జలాలతో లాభం చేకూర్చకుండా వరద జలాలపై ఆధారపడి నీళ్లు రాక రైతుల ఆత్మహత్యలు, వలసలు పెరుగుతాయన్నారు. మక్తల్ నుంచి వెళ్తున్న కృష్ణమ్మ శ్రీశైలం జలాశయానికి వెళ్లిన తర్వాత వెనక్కి తెస్తామని చెప్పడం సరికాదన్నారు. 90శాతం నిధులు కేంద్రం ఇస్తుంటే కేవలం 10శాతం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడానికి ఎందుకు ఇబ్బందని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లను బతికించడానికే కేసీఆర్ డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. ఇంజినీర్ల ఫోరం ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోకుండా పాలమూర్-రంగారెడ్డి వైపు మొగ్గు చూపడం సరికాదన్నారు. భవిష్యత్‌లో మరింత ఉధృతంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కోకన్వీనర్ హెచ్ నర్సింహ, వెంకోబ, రంగారెడ్డి, రఘువీర్‌యాదవ్, వెంకట్రాంరెడ్డి, మోహన్, రాజు, రవి, కొంగరిరాములు, బాలప్ప, దస్తప్ప, ఆంజనేయులు, చంద్రకాంత్, రాజేందర్ రెడ్డి, తాయప్ప, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మండలం ప్రకటించే వరకు నిరసన



దీక్షలో కూర్చున్న ఆటో యూనియన్ నాయకులు

నారాయణపేట రూరల్: కోటకొండను మండలంగా ప్రకటించే వరకు నిరసన ఆగదని నాయకులు స్పష్టం చేశారు. మండలంలోని కోటకొండలో నిర్వహిస్తున్న రిలేదీక్షలు 14వ రోజుకు చేరుకున్నాయి. మంగళవారం దీక్షలో ఆటో యూనియన్ నేతలు కూర్చొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు తాత్కాలికంగా భవనాలు ఉన్నాయని, కొత్త భవన నిర్మాణానికి అనువైన ప్రభుత్వ స్థలం ఉందన్నారు. విద్య, వైద్యం తదితర విషయాల్లో హైస్కూల్, పీహెచ్‌సీలు ఎన్నో ఏళ్లుగా నడుస్తున్నాయని చెప్పారు. రాజకీయ పరంగా ఎంతో చైతన్యవంతమైన ప్రాంతమని గుర్తు చేశారు. చుట్టు పక్కల ఎన్నో గ్రామాలకు కేంద్ర బిందువుగా ఉందన్నారు. ఇటీవల కొడంగల్ నియోజకవర్గంలో కొత్తపల్లి, గుండుమాల్‌లను మండలాలుగా ప్రకటించి అన్ని అర్హతలు ఉన్న కోటకొండను విస్మరించడం రాజకీయ దురుద్దేశమేనని విమర్శించారు. నాడు ఎన్‌టీఆర్ ప్రభుత్వంలోనే కోటకొండ మండలం అయ్యే అవకాశాలు ఉండగా, నాడు చైతన్యంలేక వెనకబడ్డారని, ప్రస్తుతం ఉద్యమాన్ని ఉధృతం చేసైనా సాధించుకుంటామన్నారు. వెంటనే ఎమ్మెల్యే చొరువ తీసుకుని రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి కోటకొండను మండలంగా ప్రకటించేలా ఒత్తిడి తేవాలని కోరారు. కార్యక్రమంలో కెంచెశ్రీనివాసులు, వెంకట్రాములు, హాజిమలాంగ్, బాలప్ప, చెన్నప్ప, రాములు, సుభాష్, నర్సింహులు, సలీం, నరేష్, రాఘవేందర్, కేశవులు, రాఘవులు, రామకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలి రేట్లు పెంచాలి



మాట్లాడుతున్న నాయకులు

నారాయణపేట రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు గిట్టుబాటు అయ్యే విధంగా కూలి రేట్లు పెంచాలని ఏఐపీకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ డిమాండ్ చేశారు. మండలంలోని పేరపళ్లలో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు అందించి, మేటీలకు పారితోషికం ఇవ్వాలన్నారు. ఇన్సురెన్స్, సేఫ్టీ కిట్, పనిముట్లు, కనీస సౌకర్యాలపై దృష్టి సారించాలన్నారు. గతంలో 82 రకాల పనులు చేయిస్తుండగా వాటిని కుదించి 22 రకాల పనులు మాత్రమే అనుమతులు ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఉపాధి హామీ కూలీల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హాజిమలాంగ్, వెంకట్రాములు, శివ పాల్గొన్నారు.